## క్లుప్తంగా

### చాముండేశ్వరీదేవికి శాకంబరి అలంకారం రేపు

ఇందుకూరుపేట: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలో వెలసిన శ్రీచాముండేశ్వరీదేవి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులను కటాక్షిస్తారని ఆలయ కార్యనిర్వాహణాధికారి బండి శాంతయ్య శుక్రవారం తెలిపారు. పండ్లు, కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు.

### నేత్రదానం


పాలకీర్తి పోలమ్మ (ఫైల్)

విడవలూరు: స్థానిక కామాక్షినగర్‌లో నివాసం ఉంటున్న పాలకీర్తి పోలమ్మ(65) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె కోరిక మేరకు కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మోడరన్ ఐ ఆస్పత్రికి దానం చేశారు. పోలమ్మ నేత్రాలను ఐ టెక్నీషియన్ వేణు సేకరించారు.

### సైనికుల దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకోవాలి


మొక్క నాటుతున్న అధికారులు, విద్యార్థులు

నెల్లూరు (టౌన్): సైనికుల దేశభక్తి, త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారాధికారి నాగసాయిసూరి పేర్కొన్నారు. కార్గిల్ విజయ దివస్ రజతోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తాతయ్య బడిలో కార్యక్రమాన్ని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం అమరవీరులకు నివాళిగా అమ్మ పేరిట ఒక మొక్కను స్కూల్ ఆవరణలో నాటారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులుగా పుస్తకాలను అందజేశారు.
– కోటమిట్టలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని సామాజిక వన విభాగం, శుభమస్తు షాపింగ్‌మాల్, వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

### కార్గిల్ విజయోత్సవ ర్యాలీ



నెల్లూరు సిటీ: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని నగరంలోని వైఎంసీఏ గ్రౌండ్స్ నుంచి గాంధీబొమ్మ వరకు విజయోత్సవ ర్యాలీని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గుత్తా అశోక్‌నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షుడు మాచిరాజు వెంకటేష్, మదన్‌సాయిరెడ్డి, సాయికృష్ణయాదవ్, జిల్లా కార్యదర్శి తిరుపతి నాయుడు, కృష్ణసాయినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఆ వ్యాఖ్యలు సరికావు



నెల్లూరు సిటీ: టిప్పు సుల్తాన్ స్వాతంత్ర్య సమరయోధుడని సీపీఎం నేతలు వ్యాఖ్యానించడం సబబు కాదని బీజేపీ నేత పైడి ఆదినారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నరాల సుబ్బారెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సృజన తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికలపై అవగాహన



నెల్లూరు (టౌన్): రామలింగాపురంలోని నారాయణ స్కూల్లో విద్యార్థులకు ఎన్నికలను రాయ్ సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాల దశ నుంచే ఎన్నికలు, నాయకత్వ లక్షణాలను వివరించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏజీఎం రమణారెడ్డి, డీన్ నరేంద్ర, ప్రిన్సిపల్స్ వెంగళరావు, సోనీ, ఏఓ శివరంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగృహాల నిర్మాణాలకు బ్రేక్!


ముత్తుకూరులో ఎన్నికలకు ముందు పూర్తయిన ఇళ్లు


ఎన్నికల తర్వాత పంటపాళెంలో ముందుకు కదలని ఇళ్ల నిర్మాణాలు

- ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై సందిగ్ధం
- కొత్త ప్రభుత్వం నిర్ణయంపై ఎదురుచూపులు

ముత్తుకూరు: మండలంలోని జగనన్న కాలనీల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పక్కాగృహాల నిర్మాణాలకు బ్రేక్ పడింది. మంజూరైన ఇళ్లు నిర్మించుకోవడంలో లబ్ధిదారులు నిరాసక్తత చూపుతున్నారు. ముఖ్యంగా ఎస్టీ, ఎస్సీలకు చెందిన పక్కాగృహాల నిర్మాణం ముందుకు కదలడం లేదు. గత ప్రభుత్వంలో మండలంలో మొత్తం 29 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేయగా, ఇందులో 1,440 పక్కాగృహాలు మంజూరు చేశారు. హౌసింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో 291 పక్కాగృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. గృహప్రవేశాలు జరిగాయి. మరో 75 ఇళ్లకు స్లాబులు పూర్తయ్యాయి. 516 గృహాలు వివిధ దశల్లో నిర్మాణమవుతున్నాయి. 558 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. సరిగ్గా ఎన్నికల కోడ్ వచ్చిన క్రమంలో పక్కాగృహాల నిర్మాణం నిలిచిపోయింది. ఎన్నికలు పూర్తయి ఫలితాలు వెలువడ్డాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడిచినా ఇళ్ల నిర్మాణాలు ముందుకుసాగడం లేదు. ప్రభుత్వం పక్కాగృహాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న సందేహమే దీనికి కారణమని పలువురు పేర్కొంటున్నారు.

అధికారులు ఎంతగా నచ్చచెబుతున్నా లబ్ధిదారుల్లో కదలిక రావడం లేదు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు చెందిన 294 పక్కాగృహాల నిర్మాణం సందిగ్ధంలో పడింది. ఇసుక, సిమెంటు, ఇనుము తదితర మెటీరియల్ ధరలు పెరిగిపోతాయేమోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పక్కాగృహాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకొనే వరకు ఇళ్ల నిర్మాణాలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

### బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి



ముత్తుకూరు మండలంలోని కాలనీల్లో ప్రారంభం కాని పక్కా గృహాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై దృష్టి సారించాం. పనులు జరిగే ఇళ్లకు సంబంధించి బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి.
– సుబ్రహ్మణ్యం, ఏఈ, హౌసింగ్

### విద్యుత్‌కు అంతరాయం నేడు

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): వెంకటాచలం మండల పరిధిలోని ఇస్కపాళెం సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా సర్వేపల్లి, ఇస్కపాళెం, నిడిగుంటపాళెం, జోసఫ్‌పేట, తిక్కవరప్పాడు తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈ మేరకు ఏఈ తిరుపతయ్య శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

### గొలగమూడిలో ఉచిత పశు వైద్యశిబిరం



వెంకటాచలం: మండలంలోని గొలగమూడి గ్రామంలో గురువారం స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీనివాసులునాయుడు పశువులను పరీక్షించారు. ఎదకు రాని గేదెలకు, ఆవులకు సంతానోత్పత్తి ఇంజక్షన్లు వేశారు. అలాగే సాధారణ వ్యాధులకు చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నట్టల నివారణ మందులను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు సమద్, శ్రావణ్‌కుమార్, మనోజ్, సుధీర్, పశుపోషకులు పాల్గొన్నారు.

## కూరగాయల తోట పరిశీలన


తోటలో పంటల సాగు గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

ముత్తుకూరు: శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం సమీపంలోని కూరగాయల తోటను సందర్శించారు. రైతులు పండిస్తున్న కూరగాయలు, కూలీల పనులను పరిశీలించారు. తోటకూర, బీర, పొట్ల కాయల సాగును, వాటి విత్తనాలు, వినియోగించే ఎరువులు, పురుగు మందుల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. స్ప్రింక్లర్ల ద్వారా సరఫరా అయ్యే సాగు నీటిని ఆసక్తిగా తిలకించారు. కూరగాయల సాగు వల్ల వచ్చే ఆదాయం, కష్టనష్టాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజ, మాధవి, సుమతి, రేఖారాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

### భూ యజమానులు కౌలు రైతులకు సహకరించాలి

పొదలకూరు: భూ యజమానులు కౌలు రైతుల(పంట సాగుదారుల)కు సహకరించాలని ఏఓ ఎ.వాసు సూచించారు. శుక్రవారం ఆయన పొదలకూరులో మాట్లాడుతూ భూయజమానులు ఇచ్చే పంటసాగు పత్రం ద్వారా కౌలు రైతులకు ఎలాంటి హక్కు భూమిపై లభించదని తెలిపారు. పంటసాగు పత్రం కాలపరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందన్నారు. పంటసాగు పత్రం కౌలు రైతుకు పంటనష్టం వాటిల్లిన సమయంలో పరిహారం వర్తించేందుకు, పంటను విక్రయించుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతుందని తెలిపారు. భూయజమానులు నిరభ్యంతరంగా హక్కు పత్రాలను అందజేయవచ్చని తెలిపారు.

### చిత్రాలతో బోధన విద్యార్థులకు ఉపయోగకరం



కొడవలూరు: చిత్రాలతో బోధించడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉందని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా ఐదో రోజు శుక్రవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ డే నిర్వహించారు. నార్తురాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన 'ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డు' బోధనా కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్రాల రూపంలో చూస్తూ వినడం వల్ల విద్యార్థులకు ఎక్కువ కాలం గుర్తుండిపోతుందని తెలిపారు. అందుకే ప్రభుత్వం ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డులను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.ఓబులేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దోమల నివారణతో డెంగీ దూరం


డెంగీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఏ వెంకట్రావు

కొడవలూరు: దోమల నివారణతో డెంగీ వ్యాధిని దూరం చేయవచ్చని కొడవలూరు పీహెచ్‌సీ హెచ్‌ఏ వెంకట్రావు తెలిపారు. మండలంలోని రెడ్డిపాళెం ఉన్నత పాఠశాలలో డెంగీ వ్యాధిపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడిస్ అనే పగటి దోమ కుట్టడం ద్వారా డెంగీ వ్యాధి సోకుతుందన్నారు. మంచినీరు నాలుగైదు రోజులకు పైన నిల్వ ఉంటే ఈ దోమ ఉత్పత్తి అవుతుందన్నారు. పాఠశాల, ఇళ్ల పరిసరాల్లోని తొట్టెలు, వాడి పారేసిన టైర్లలో నీరు, లేక వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డెంగీ బారిన పడకుండా ఉండాలంటే దోమలు కుట్టకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ, ఏఎన్‌ఎం నదియ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు


రైతులతో కలిసి వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మనుబోలు: వరి పైరును ఆశించే తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ శివనాయక్ పేర్కొన్నారు. మండలంలోని జట్లకొండూరు రైతులు సాగు చేస్తున్న వరిపైరును శుక్రవారం ఆయన మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపైరును ఆకుచుట్టు పురుగు ఆశించిందని, దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 50 ఈసీ మందును ఎకరానికి 250 ఎంఎల్ చొప్పున పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చని తెలిపారు. అనంతరం పిడూరు, జట్ల కొండూరు గ్రామాల్లో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెందోటి భాస్కర్‌రెడ్డి, గాలి రామకృష్ణారెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది అర్షద్, బాషా తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి


రోగికి వైద్యం అందించే తీరును తెలుసుకుంటున్న డీసీహెచ్‌ఎస్ రమేష్‌బాబు

కోవూరు: ప్రభుత్వ వైద్యశాలలకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ రమేష్ సూచించారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న రోగులతో మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యంపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కలిగేలా డాక్టర్లు పనిచేయాలని, రోగికి అందించే వైద్యసేవల్లో అలసత్వం వహించకూడదని తెలిపారు. గుండెపోటు వచ్చే రోగులకు అత్యవసర సమయంలో వేసే ఇంజెక్షన్ ఉచితంగా వేస్తున్నామని, ఈ ఇంజెక్షన్ అందుబాటులో ఉన్న విషయాన్ని ప్రజలు గమనించాలని తెలిపారు. ముఖ్యంగా గుండెపోటు వచ్చే రోగులకు అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట సూపరింటెండెంట్ వెంకటచలపతిగౌడ్, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మందులతో కుష్టువ్యాధి నివారణ



పొదలకూరు: కుష్టువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మందులు వాడితే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ మోహన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం పొదలకూరు పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో జరుగుతున్న కుష్టువ్యాధి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను సిబ్బంది పకడ్బందీగా చేయాలని, 2027 నాటికి కుష్టువ్యాధి రహిత దేశంగా భారత్‌ను నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎండీటీ మాత్రలు వాడితే కుష్టువ్యాధి సోకిన వారికి కూడా అంగవైకల్యం రాదన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రవికుమార్, సుమాంజలి, రాధాకుమారి పాల్గొన్నారు.

## సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ వాసు

పొదలకూరు: రైతులు పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏఓ ఎ.వాసు సూచించారు. పొదలకూరు మండలంలోని తాటిపర్తి గ్రామంలో శుక్రవారం ఏఓ రైతులతో కలిసి వరి పంటను పరిశీలించి వరిపైరుకు ఆశించిన మైట్, దోమపోటును గుర్తించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మైట్ నివారణకు ఒబెరాన్ 0.5 ఎంఎల్ లీటరు(100 ఎంఎల్ ఎకరాకు)నీటికి, దోమపోటు(బీపీహెచ్)కు ఫెక్సలాన్ 0.5 ఎంఎల్ లీటరు(94 ఎంఎల్ ఎకరాకు) నీటిలో కలిపి పంటపై పిచికారీ చేస్తే మైట్, దోమపోటును నివారించవచ్చని తెలిపారు. అనంతరం ఖరీఫ్‌లో వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఆయన వెంట ఏఈఓ ఏడుకొండలు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆధార్ విధిగా పొందాలి


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

కొడవలూరు: ప్రతి ఒక్కరూ ఆధార్ విధిగా పొందాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ సూచించారు. మండలంలోని యల్లాయపాళెం–2 సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికీ కొందరు గిరిజనులకు ఆధార్ లేకపోవడం ఎంపీడీఓ దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ లేకపోవడం వల్ల కనీసం రేషన్ కూడా పొందలేరని తెలిపారు. ప్రభుత్వ రాయితీలు పొందాలంటే ప్రతి ఒక్కరూ విధిగా ఆధార్ తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది కూడా అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించి ఆధార్ నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వగ్గు శీనయ్య, డిజిటల్ సహాయకుడు రాజేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# వానొస్తే రక్షణ కరువు

- తుఫాన్ షెల్టర్లు అలంకారప్రాయమేనా..
- కనీస సౌకర్యాలు లేక నిరూపయోగంగా మారిన వైనం
- వర్షాలు తీవ్రమైతే తీరప్రాంత వాసులకు ఇబ్బందులు



కనీస సౌకర్యాలు లేక అలంకారప్రాయంగా ఉన్న మల్లికార్జునపురం, చంద్రశేఖరపురం తుఫాన్ షెల్టర్లు

తోటపల్లిగూడూరు: భారీ వర్షాలు, తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో రక్షణతోపాటు ఆసరా కల్పించేందుకు ప్రభుత్వాలు నిర్మించిన తుఫాన్ షెల్టర్లు అలంకారప్రాయంగా మారిపోయాయి. కనీస సౌకర్యాలు లేక నిరుపయోగంగా ఉన్నాయి. తోటపల్లిగూడూరు మండలంలోని తీరప్రాంత గ్రామాలైన కోడూరు, వెంకన్నపాళెం, మండపం, ఈదూరు, మల్లికార్జునపురం పంచాయతీల్లో, వివిధ మజరా గ్రామాల్లో 18 తుఫాన్ షెల్టర్లు ఉన్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో స్థానికులు ఈ తుఫాన్ షెల్టర్లను వినియోగించుకుంటారు.

**మౌలిక వసతులు కరువు**

ప్రకృతి విపత్తుల సమయంలో తీరప్రాంత వాసులకు ఉపయోగపడాల్సిన తుఫాన్ షెల్టర్లలో మౌలిక వసతులు కరువయ్యాయి. వెంకన్నపాళెం పంచాయతీలోని పట్టపుపాళెం, కోడూరు పంచాయతీలోని ముత్యాలతోపు, పాతపట్టపుపాళెం, కొత్తపట్టపుపాళెం, ఎద్దలరేవుసంఘం, రవీంద్ర పట్టపుపాళెం, నడింపట్టపుపాళెం, మండపం పంచాయతీలోని ఈదూరుపట్టపుపాళెం గ్రామాల ప్రజలు భారీ వర్షాలు, తుఫాన్ల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమయాల్లో అధిక శాతం స్థానికులు గ్రామాలను వదిలి తుఫాన్ షెల్టర్లను ఆశ్రయించాల్సి ఉంటుంది. అయితే మండలంలోని 18 తుఫాన్ షెల్టర్లలో మూడు మినహా మిగిలినవన్నీ శిథిలావస్థకు చేరాయి. అంతేకాక ఏ తుఫాన్ షెల్టర్‌లోనూ విద్యుత్ సౌకర్యం గానీ, తాగునీటి వసతి గానీ లేవు. దీంతో వర్షాల సమయంలో ఆయా గ్రామాల ప్రజలు చీకటి గదుల్లో, దాహంతో విలవిలలాడాల్సిన పరిస్థితి ఉంది. అంతేకాక షెల్టర్లలో ఉన్న అధిక శాతం గదులకు తలుపులు, కిటికీలు లేకపోవడంతో షెల్టర్లలో పూర్తిగా రక్షణ లేకుండా పోయింది.

అధికారుల పర్యవేక్షణ లేనందున చాలా తుఫాన్ షెల్టర్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఈ క్రమంలో ఏ తుఫాన్ షెల్టర్‌ను కూడా స్థానికులు సక్రమంగా వినియోగించుకొనే పరిస్థితి కన్పించడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ మొదలైన నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి తుఫాన్ షెల్టర్లలో మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

### కనీస సౌకర్యాలు కల్పించాలి



తుఫాన్ షెల్టర్లలో కనీస సౌకర్యాలను కల్పించాల్సిన పాలకులు చిత్తశుద్ధి చూపడం లేదు. ప్రకృతి విపత్తుల సమయాల్లో స్థానికులు తుఫాన్ షెల్టర్లలోకి వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. దీంతో కష్టమైనా, భయమైనా ఇళ్లలోనే తలదాచుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తుఫాన్ షెల్టర్లలో కనీస సౌకర్యాలను కల్పించాల్సి ఉంది.

– సుధాకర్, ముత్యాలతోపుపట్టపుపాళెం